విశాలాంధ్ర
గోదావరి జిల్లా
కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

అరకొరగా మరమ్మతులు .. మూసివేతలు యథాతథం

- ఈసారైనా బ్రిడ్జిని సక్రమంగా తీర్చిదిద్దుతారా...
- 27 నుంచి అక్టోబర్ 26 వరకు రోడ్డు, రైలు వంతెన మరమ్మతులు
- రూ.2 కోట్ల 10 లక్షలతో చేపడుతున్న పనులు

విశాలాంధ్ర బ్యూరో - రాజమహేంద్రవరం : రోడ్ కమ్ రైల్ బ్రిడ్జ్ - తూర్పు గోదావరి జిల్లా - సెంట్రల్ క్యారేజ్‌వేకి మరమ్మతులు మరియు వయాడక్ట్ భాగం మరియు అప్రోచ్‌లతో సహా దెబ్బతిన్న సెకండరీ జాయింట్లు మరమ్మత్తులకు చేపట్టడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ డా కె. మాధవీలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమేరకు ది.27.09.2023 బుధవారం (ప్రారంభ గంటలు) నుండి 26.10. 2023 వరకు ఆర్ కం రైల్ వంతెన పై ట్రాఫిక్‌ను మళ్లించడానికి జిల్లా ఆర్ అండ్ బి అధికారి అభ్యర్థన చెయ్యడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో ఆర్ సి ఆర్ బి పై పూర్తిగా మేరకు ట్రాఫిక్ మళ్లింపు చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతమున్న రోడ్-కమ్-రైల్ బ్రిడ్జి (అప్రోచ్‌లతో సహా) యొక్క క్యారేజ్‌వే బాగా దెబ్బతినడం వల్ల, మరమ్మత్తు పనులకు సులువుగా ఉండేలా తక్షణ పునరుద్ధరణ అవసరం మేరకు వాహనాల రాకపోకల కదలికను పూర్తిగా నెల రోజుల పాటు నియంత్రించనున్నట్లు పేర్కొన్నారు. రోడ్-కమ్-రైల్ బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టడానికి గాను వయాడక్ట్ భాగం మరియు అప్రోచ్‌లతో సహా బి.టి. క్యారేజ్‌వే పునరుద్ధరణ 0.00 కి.మీ.ల నుంచి 4.473 కి.మీ.ల పొడవు దెబ్బతిన్న సెకండరీ జాయింట్ల వద్ద జియో గ్లాస్ గ్రిడ్‌లకు చెందిన ప్రత్యేక మరమ్మత్తు, మెరుగుదలలు రూ.210 లక్షలతో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. టెండర్లు ప్రక్రియ పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే మిల్లింగ్ మిషన్ తో బిటి సర్ఫేస్‌ను తొలగించడం తదితర పనులు చేపట్టడం జరిగిందన్నారు. చేపడుతున్న పనుల దృష్ట్యా పూర్తి స్థాయిలో ట్రాఫిక్‌ను నియంత్రిస్తూ, ప్రత్యామ్నాయ మార్గాలను ట్రాఫిక్ పోలీసులు సూచించడం జరుగుతుందన్నారు. పై విషయాలను దృష్టిలో ఉంచుకుని తూర్పుగోదావరి పోలీసు సూపరింటెండెంట్, రాజమహేంద్రవరం వారు రాజమహేంద్రవరం, కొవ్వూరు ల నుంచి ట్రాఫిక్ మళ్లింపులో తగు చర్యలు తీసుకోవాలని కోరడం జరిగింది. అదేవిధంగా జిల్లా రవాణా అధికారి, తూర్పుగోదావరి, రాజమహేంద్రవరం మరియు రీజనల్ మేనేజర్, ఎపీఎస్ ఆర్టీసి తూర్పు గోదావరి, రాజమహేంద్రవరం వారు వాహనాలు దారి మళ్లించడంలో సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 26 వరకు చెందిన కాలానికి అనుగుణంగా తగిన అవసరమైన చర్య తీసుకోవాలని సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారి తూర్పుగోదావరి, రాజమహేంద్రవరం జిల్లాలోని సంబంధిత విద్యాసంస్థలకు ఆర్ సి ఆర్‌బి మూసివేత గురించి ముందస్తుగా సమాచారం తెలియజేయాలని ఆదేశించారు. తదనుగుణంగా వారు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకుంటారని పేర్కొన్నారు ప్రతీయేటా మరమ్మతులు కోసం మూసివేయడం ఆనవాయితీగా మారడం తదుపరి రిపేర్లు సరిగా చేయక మళ్ళీ పోవడం పట్ల విసుగుచెందిన గోదావరి జిల్లా ప్రజలు ఈసారైనా సరిగా చేస్తారా అనే అసహనం వ్యక్తం చేస్తున్నారు..

అమలాపురంలో పిఆర్ ఇంజనీర్స్ వర్కుషాప్

విశాలాంధ్ర - అమలాపురం : స్థానిక పంచాయతి రాజ్ సమావేశ మందిరంలో జిల్లా పిఆర్ ఇంజనీర్స్, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో జరిగిన వర్క్ షాప్‌కు ముఖ్య అతిథిగా చీఫ్ ఇంజనీర్ కృష్ణా రెడ్డి పాల్గొని సచివాలయం పరిధిలో నిర్మిస్తున్న ఆర్‌బికె, సచివాలయం, వెల్నెస్ సెంటర్‌లు పూర్తి నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలన్నారు. భవన నిర్మాణం లో తీసుకోవలసిన జాగ్రత్తలు సర్క్యులర్ రూపంలో ఇచ్చారు. ఈ చంటిబాబు మాట్లాడుతూ ప్రతి ఇంజనీరింగ్ అసిస్టెంట్ గ్రామ స్థాయిలో అందుబాటులో ఉంటూ పూర్తి నాణ్యతతో భవనాలు నిర్మించాలన్నారు. ఈ వర్క్ షాప్‌కు జిల్లా నుండి సుమారు 60 మంది ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు పిఆర్‌డి ఈఈ శివ ప్రసాద్, పిఎస్ రాజకుమార్, అన్యం రాంబాబు, భూషణ్ ప్రసాద్, రాజు, రాంన్నారాయణ, ఏఈలు శ్రీనివాస్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

దారి దోపిడీకి పాల్పడిన ముగ్గురు హిజ్రాల అరెస్టు

హిజ్రాల ఆగడాలకు అడ్డుకట్ట వేసిన అమలాపురం పోలీసులు

విశాలాంధ్ర - అమలాపురం : ఇటీవల కాలంలో హిజ్రాల ఆగడాలు మరీ ఎక్కువయ్యాయి. ప్రతిరోజూ షాపుల వద్దకు వచ్చి యజమానుల వద్ద డబ్బులు డిమాండ్ చేయడమే కాకుండా, పెళ్ళి మండపాల్లోకి జొరబడి సెంటిమెంట్ రూపంలో వేలాది రూపాయలు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ఎవ్వరూ పిర్యాదు చేయకపోవడంతో వారి ఆగడాలకు అడ్డుకట్ట లేకుండా పోయింది. ఈ క్రమంలో అమలాపురం పట్టణం సావరం బైపాస్ రోడ్డులో ఈనెల 21వ తేది రాత్రి ప్రాంతంలో అంబాజీపేట మండలంలోని ఒక గ్రామానికి చెందిన 30 సంవత్సరాల యువకుడు హిజ్రాలను చూసి ఆగి వారితో కొంతసేపు మాట్లాడి కాలక్షేపం చేసిన తరువాత వారికి 500 రూపాయలు ఫోన్ పే చేసాడు. ఆ క్రమంలో అతని మెడలో ఉన్న బంగారు గొలుసును ముగ్గురు హిజ్రాలు లాక్కుని పోతుండగా అతను దాన్ని పట్టుకొని గించుకోవడంతో కొంతముక్క తెగిపోయింది. వెంటనే ఆ ముగ్గురు హోండా యాక్టివా పై పరారీ అయ్యారు. ఈ విషయంపై ఆ యువకుడు 22వ తేదీన అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు కాకినాడ, వలసపాకలకు చెందిన రెల్లి రవి ఏ స్వీటీ, రేచర్లపేటకు చెందిన ఏడిద రమేష్ ఏ కీర్తి, గుల్లపల్లి రాజు ఏ అమూల్య అనే ముగ్గురు హిజ్రాలను గుర్తించి అరెస్టు చేసి వారివద్ద నుండి 4.7గ్రాముల బంగారు లాకెట్ చైన్ మరియు నేరానికి ఉపయోగించిన హోండా యాక్టివా బైక్ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ముద్దాయిలను కోర్టులో హాజరు పరచగా కోర్టు వారికి 14 రోజులు రిమాండ్ విధించడంతో వారిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. కేసును సత్వరం చేదించిన అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్చార్జి ఇన్స్పెక్టర్ పి వీరబాబు, పట్టణ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ కెఎం జోషిలను అమలాపురం డిఎస్పీ ఎం అంబికా ప్రసాద్ అభినందించారు. అధేవిధంగా హిజ్రాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా వారి వలన ఇబ్బందులకు గురైతే పోలీసులకు పిర్యాదు చేయాలని డిఎస్పీ తెలిపారు.

కొనసాగుతున్న టీడీపీ రిలే నిరాహార దీక్షలు

విశాలాంధ్ర - ముమ్మిడివరం : ముమ్మిడివరం తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ తెలుగుదేశం పార్టీ శ్రేణులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 12వ రోజు టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ముమ్మిడివరం నియోజకవర్గ ఇంచార్జ్ దాట్ల సుబ్బరాజు ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ముమ్మిడివరం నియోజకవర్గ మాజీ చెల్లి వివేకానంద మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి పాలన చరమగీతం పాడే రోజు త్వరలోనే ఉందని దళితులపై తీవ్రమైన దాడులు జరుగుతున్నాయని దళితులకు సంబంధించిన 27 పథకాలు రద్దు చేశారని, ప్రశ్నించే వారిని అరెస్టులు చేసి తప్పుడు కేసులు బనాయిస్తున్నారని, ఏ తప్పు చేయని చంద్రబాబు నాయుడుని తప్పుడు కేసు పెట్టి జైల్లో పెట్టారని, రాజమండ్రి జైల్లో కూడా చంద్రబాబు నాయుడుకి హాని తలపెట్టేలాగా చూస్తున్నారని, చంద్రబాబు నాయుడుకి ఏమైనా జరిగితే పూర్తి బాధ్యత జగన్మోహన్ రెడ్డి బాధ్యత వహించవలసి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెల్లి అశోక్, గోలకోటి దొరబాబు, దొమ్మేటి రమణకుమార్, తాడి నరసింహారావు, నడింపల్లి సుబ్బరాజు, కురసాల శివ, వాసంశెట్టి అమ్మాజీ, కుడిపూడి మల్లేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

నేడు జగ్గంపేట రానున్న బువనేశ్వరి, బ్రహ్మణి

విశాలాంధ్ర - జగ్గంపేట : నేడు జగ్గంపేటలో జరిగే 12వ రోజు రిలే నిరాహార దీక్షలకు చంద్రబాబు సతీమణి భువనేశ్వరి, లోకేష్ సతీమణి బ్రాహ్మణి హాజరవుతారని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ తెలిపారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ 12వ రోజు దీక్ష జగ్గంపేట నియోజకవర్గ మహిళ ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ శ్రేణులు, మహిళలు, ప్రజాస్వామ్యవాదులు, ప్రజలు, యువత, మేధావులు విచ్చేసి నియంత జగన్‌పై పోరాటానికి సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో మారిశెట్టి భద్రం, జంపన సీతారామచంద్ర వర్మ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీ గణపతి స్వామి ఊరేగింపు

విశాలాంధ్ర - పి గన్నవరం : పి గన్నవరం మండలంలోని లంకల గన్నవరం గ్రామంలో పెదలోన వద్ద ఉన్న శ్రీ లక్ష్మీ గణపతి స్వామి వారి ఆలయం వద్ద వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ మేరకు ఆదివారం ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు లక్ష్మీ గణపతి స్వామి వారి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తీన్మార్ డబ్బులతో యువత దాన్సులు వేస్తూ సందడి చేశారు. ఈ మేరకు లంకల గన్నవరం గ్రామంలో వాడవాడల లక్ష్మీ గణపతి స్వామి వారి ఊరేగింపు ఘనంగా జరిగింది. స్వామివారిని ఊరేగింపుగా తీసుకువెళ్లి పవిత్ర గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుండి లంకల గన్నవరంలోని పెదలోన వద్ద ఉన్న లక్ష్మీ గణపతి స్వామి వారి ఆలయం వద్ద అన్న సమారాధన కార్యక్రమం జరుగుతుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

మొదటి మహిళా రైల్వే బోర్డ్ చైర్మన్‌ను కలసిన ఎంపీ వంగా గీత

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ పార్లమెంట్ సందర్శనకు ఆహ్వానం. భారత దేశ రైల్వే చరిత్రలో మొదటి మహిళా రైల్వే బోర్డ్ చైర్మన్ జయవర్మ సిన్హాను కలసి అభినందించడం జరిగింది. కాకినాడ పార్లమెంటులో రైల్వే స్టేషన్‌లు అభివృద్ధి త్వరితగతిన పూర్తి చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. స్టేషన్లలో ముఖ్యమైన ట్రైన్స్ నిలుపుదల గురించి చర్చించారు. విజయవాడ నుండి విశాఖపట్నం మధ్య ట్రాక్ పనులు వలన చాలా రైళ్ళు నిలుపుదల వలన ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. సాధ్యమైనంత త్వరగా ట్రైన్స్ పునరుద్ధరణ చేయాలనీ కోరారు. కాకినాడ పోర్ట్ రైల్వే స్టేషన్ ఎక్స్‌పోర్ట్‌కు ప్రసిద్ధి కావున పోర్ట్ స్టేషను అభివృదికి సహకరించాలని కోరారు. కాకినాడ పార్లమెంటులో రైల్వే సందర్శనకు రావాలని కోరడం జరిగింది. కాకినాడ పార్లమెంట్ సందర్శనకు ఆహ్వానం.

క్లస్టర్ వన్ ఇన్‌చార్జ్‌గా కడియాల చిన్న

ఎమ్మెల్యే కన్నబాబుకు గజమాలతో సత్కారం

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : వైకాపా కాకినాడ రూరల్ క్లస్టర్ వన్ ఇంచార్జ్ కడియాల చిన్న ఆదివారం ఉదయం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కార్యకర్తల సమక్షంలో కలుసుకుని గజమాల వేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా 50వ వార్డ్ ఇంచార్జ్ ఐ శ్రీను మాట్లాడుతూ 2024లో మరల పార్టీ ఘనవిజయం సాధించాలంటే ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని, ఎమ్మెల్యేగా కురసాల కన్నబాబును మరోసారి గెలిపించుకోవాలంటే ప్రతి కార్యకర్త ఐక్యంగా పనిచేసి ముందుకు వెళ్లాలన్నారు. అదేవిధంగా 1,2,3,47,48,49 వార్డులతో పాటు స్వామి నగర్‌లకు క్లస్టర్ వన్ ఇన్చార్జిగా నాకు అవకాశం ఇచ్చిన ఎమ్మెల్యే కురసాల కన్నబాబుకు ప్రత్యేకమైన కృతజ్ఞతలు ధన్యవాదాలని కడియాలు చిన్న తెలిపారు. పార్టీని బలోపేతం చేసేందుకు నా వంతు కృషి ఎల్లప్పుడూ చేస్తానని తెలియజేశారు. ప్రముఖ డైరెక్టర్ కురసాల కళ్యాణకృష్ణ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు కార్యకర్తలు 49, 50 వార్డు సభ్యులు మరియు శ్రీ సిద్ధ వినాయకసంఘ సభ్యులు పాల్గొన్నారు.

12వ రోజుకు టీడీపీ రిలే దీక్షలు

విశాలాంధ్ర - కరప : కరప మండలం వేలింగి గ్రామంలో మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టులకు నిరసనగా 12వ రోజు రిలే దీక్షలు చేపట్టారు. కాకినాడ జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస్ బాబా, తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పేరా బత్తుల రాజశేఖర్, మాజీ జడ్పిటిసి సభ్యులు సులుకుర్తి వెంకటేశ్వరరావు, వాసిరెడ్డి ఏసుదాసు, చప్పిడి వెంకటేశ్వరరావు నాయకులు ఆధ్వర్యంలో చంద్రబాబుకు మద్దతుగా దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ బాబా మాట్లాడుతూ చంద్రబాబుని విమర్శించే అర్హత కన్నబాబుకు లేదని గురువింద గింజ తన ఎరుపుని చూసుకుని క్రింద ఉన్న నలుపును ఎరుగని చందంగా ఉందని ఎద్దేవా చేశారు. వాసిరెడ్డి ఏసుదాసు, పేరా బత్తుల రాజశేఖర్ మాట్లాడారు. అనంతరం జనసేన పార్టీ నాయకులు భోగిరెడ్డి గంగాధర్, అల్లు గంగాధర్, చింత వెంకట్ టిడిపి నాయకులకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో చుండ్రు వెంకన్న రావు, దేవు వెంకన్న, తారకం, జానకి రామయ్య, రామచంద్రరావు వెంకటలక్ష్మి, వెంకటరత్నం చౌదరి తదితర నాయకులు పాల్గొన్నారు.

అంగన్వాడీల అక్రమ నిర్బంధాలు ఆపాలి

విశాలాంధ్ర బ్యూరో - రాజమహేంద్రవరం : అంగన్‌వాడీలు తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకురావడానికి 25వ తేదీ తలపెట్టిన ధర్నాను విఫలంచేయడానికి ప్రభుత్వ, పోలీసు నిర్బంధాన్ని, అరెస్టులను వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. ఈ మేరకు సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు టి.అరుణ్, టి.మధు, సిపిఎం, సిపిఐ నగర కార్యదర్శులు బి.పవన్,వి.కొండలరావులు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. ధర్నాలో హింస జరుగుతుందనే తప్పుడు ప్రచారం పోలీసులు చేయడం గర్హనీయం. ఎక్కడికక్కడ ఇళ్ళవద్దనే అరెస్టులు చేసి నిర్బంధించడం, వాహనాలను అడ్డు కోవడం, ధర్నాకు అనుమతినివ్వకపోవడం అప్రజాస్వామికం అన్నారు. సెప్టెంబర్ 25న విజయవాడ ధర్నాకు అనుమతినివ్వాలి. వారి న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలని, అందుకు సంఘ నాయకులతో చర్చలు జరపాలన్నారు.

జగన్ అరాచక పాలనకు చరమ గీతం పాడుదాం

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు

విశాలాంధ్ర - కాకినాడ : రాష్ట్ర ముఖ్యమంత్రి అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు ప్రజలు విసిగిపోయారని రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం నడుస్తా లేదని రాజారెడ్డి రాజ్యాంగం నడుస్తుందని ఈ పాలనకు చరమ గీతం పాడుదామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం స్థానిక బాల చెరువు సెంటర్లో చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని కోరుతూ 11వ రోజు జరుగుతున్న రిలే నిరాహార దీక్షను మధు నిమ్మరసం ఇచ్చి విరమింప చేశారు. టిడిపి కాకినాడ నియోజకవర్గం ఇంచార్జ్ మాజీ శాసనసభ్యులు వనమాడి వెంకటేశ్వరరావు, కొండబాబు అధ్యక్షత వహించారు. మధు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని ప్రజా సమస్యలపై పోరాడుతున్న ప్రజానాయకుల్ని ప్రజాసంఘాల బాధ్యులను అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపుతున్నారని ఆయన అన్నారు. చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసు ఎత్తివేయాలని మధు డిమాండ్ చేశారు.

'పున్నమి చంద్రుడు'వలె చంద్రబాబు బయటకు వస్తారు

- నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రోడ్డు వెంకట రమణ

విశాలాంధ్ర - రాజానగరం : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ, బాబుతో నేను అని ఆయనకు మద్దతుగా పంపిన సుమారు ఏడునర లక్షల లేఖల్లో(కార్డులు) కేవలం 50 వేలు కార్డులు మాత్రమే చంద్రబాబుకి చేరాయని మిగిలిన ఏడు లక్షల కార్డులు ఎక్కడ అని నియోజకవర్గ టీడీపీ ఇంచార్జీ బొడ్డు వెంకట రమణ ప్రశ్నించారు. టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు అక్రమ అరెస్టుకు ఖండిస్తూ బాబుతో నేను అనే కార్యక్రమంలో బాగంగా మండలంలోని చక్రద్వారబంధం గ్రామంలో ఆదివారం రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. అలాగే కాగడాలు, కొవ్వొత్తులు వెలిగించి గ్రామ విధుల్లో ర్యాలీ నిర్వహించి నిరసనలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బొడ్డు వెంకట రమణ మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టుపై ప్రజల్లో,ఐటీ ఉద్యోగులు, మహిళల్లో నిరశనలు వెల్లువెత్తుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ ఉపాధ్యాక్షులు గంగిశెట్టి చంటిబాబు, తెలుగు యువత అధ్యక్షులు కందుల బాబు రాయుడు, నాయకులు బచ్చు ప్రసాద్,కొల్లం రత్నం,బత్తుల త్రిమూర్తులు,బత్తుల నాగేశ్వరరావు, వంక మల్లిఖార్జున స్వామి, తోటకూర నాగేశ్వరరావు, నూనె వెంకన్న, మద్దిరెడ్డి చిన్న వెంకటేశ్వరరావు, చిట్టిప్రోళ్ళ పద్దరాజు, సోడసాని రామారావు, దేవన నరసింహా రావు, ఎస్.వెంకటరావు, పేపకాయల సూర్య నారాయణ, నార్గని బంగారయ్య, మాదాబోయిన వెంకట రమణ, దాసరి శ్రీను,సోడసాని త్రిమూర్తులు, కోట గోవింద్, నల్లమిల్లి మాణిక్యలరావు, మదాబోయిన శ్రీను, పండు బ్రదర్స్, నాతిపం జాన్, దొండపాటి లాజర్, అడుసుమిల్లి హరికృష్ణ, పలివెల లక్ష్మణ్, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీని అడ్డుకున్న పోలీసులు - ఉద్రిక్తత

విశాలాంధ్ర - అనపర్తి : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్ట్ నిరసిస్తూ రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బైక్ ర్యాలీకి పిలుపునివ్వడంతో మండలంలోని రామవరంలో కొద్దిసేపు ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. స్థానిక దేవి చౌక్ సెంటర్ చేరుకుని అక్కడనుండి రాజమహేంద్రవరం వెళ్లి దేవి చౌక్ సెంటర్ వద్ద నుండి నారా భువనేశ్వరి ప్రస్తుతం నివాసముంటున్న (రాజమహేంద్రవరంలో) ప్రాంతం వరకు బైక్ ర్యాలీ నిర్వహించడానికి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఏర్పాటు చేసుకోవడం జరిగింది. దీంతో రామవరంలోనే పోలీసులు రామకృష్ణారెడ్డిని నిలువరించడంతో భారీగా అక్కడకు చేరుకున్న టిడిపి నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ పోలీసులను సైతం తోసివేసి రోడ్డుపైకి రావడంతో కొద్దిసేపు పోలీసులు, టిడిపి శ్రేణుల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది. ఒక సమయంలో సిఐని సైతం టిడిపి శ్రేణులు తోసి వేయడం జరిగింది. పోలీసుల తీరును నిరసిస్తూ నల్లమిల్లి, టిడిపి శ్రేణులు రోడ్డుపై బైఠాయించి సీఎం జగన్ చిత్రపటాన్ని దగ్ధం చేసి సైకో పోవాలి సైకిల్ రావాలి, దోపిడీ రాజ్యం దొంగల రాజ్యం నశించాలంటూ నినాదాలు చేశారు. అనంతరం రామవరం పంచాయతీ ఆఫీస్ నుండి ఎన్టీఆర్ విగ్రహం వరకు పాదయాత్ర చేసి నిరసన వ్యక్తం చేసి ఎన్టీఆర్, మూలారెడ్డి విగ్రహాలకు నివాళులర్పించారు.

టీడీపీ, జనసేన కలయికతో వైసీపీ భూస్థాపితం : జ్యోతుల

-రిలే దీక్షలకు జనసేన నేతలు మద్దతు

విశాలాంధ్ర - జగ్గంపేట : టిడిపి, జనసేన కలయికతో రాబోయే రోజుల్లో వైసిపి భూస్థాపితం అవుతుందని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేటలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 11 రోజు ఆదివారం బూరుగుపూడి క్లస్టర్ ఇంచార్జ్ పాఠంశెట్టి మురళీకృష్ణ ఆధ్వర్యంలో బూరుగుపూడి, సోమవరం, కృష్ణవరం, పాలెం, గోనేడ, తామరాడ, రామచంద్రపురం గ్రామాల టిడిపి నాయకులు దీక్షలు చేపట్టారు. వీరికి నెహ్రూ నల్ల కండువాలు వేసి దీక్షలో కూర్చోబెట్టారు. కిర్లంపూడి మండలం చిరంజీవి యువత అధ్యక్షులు ఎలుబండి శివ ఆధ్వర్యంలో జనసైనికులు బైక్‌లపై ర్యాలీగా వచ్చి రిలే నిరాహార దీక్షలకు సంఘీభావం తెలిపారు. అలాగే సోమవరం గ్రామ జనసైనికులు ఏనుగుపల్లి శ్రీను, మచ్చ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దీక్షలకు మద్దతు ఇచ్చారు. నెహ్రూ మాట్లాడుతూ రాష్ట్రంలో అనుభవం, నిజాయితీ కల వ్యక్తి చంద్రబాబుని అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమన్నారు. యువతకు ఉద్యోగ కల్పన కోసం స్కిల్ డెవలప్మెంట్ తీసుకొచ్చి అనేకమంది నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం చంద్రబాబు చేసిన నేరమా అని ప్రశ్నించారు. జనసేన, టిడిపి ఆధ్వర్యంలో వైసీపీ ప్రభుత్వం భూస్థాపితం అవుతుందని, సంఘీభావం తెలిపిన జనసైనికులు అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జంపన సీతారామచంద్ర వర్మ, జీను మణి బాబు, కొత్త కొండబాబు, కంచుమర్తి రాఘవ, దాపర్తి సీతారామయ్య, సూరంపాలెం బాలు, నల్లాల శివ, నీలం శ్రీను, పాఠం శెట్టి రవి పాల్గొన్నారు.

26న జాతీయ లైవ్ స్టాక్ మిషన్ అవగాహన సదస్సు

విశాలాంధ్ర-రాజమంహేంద్రవరం రూరల్ : బీ శ్రీ వెంకటేశ్వర ఆనం కళా కేంద్రం, రాజమహేంద్రవరం నందు జాతీయ లైవ్ స్టాక్ మిషన్ - జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమము శ్రీ వేంకటేశ్వర ఆనం కళాకేంద్రం నందు సెప్టెంబర్ 26 మంగళవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తముగా గల ఔత్సాహిక రైతులను, నిరుద్యోగులను ప్రోత్సహిస్తూ పశుసంవర్ధకశాఖ తూర్పు గోదావరి జిల్లా వారు జాతీయ లైవ్ స్టాక్ మిషన్ నిధులతో గ్రామీణ స్థాయిలో పశు పోషణ ద్వారా ఆర్థిక పురోగతి సాధించుకొనే దిశలో ఈ అవగాహన కార్యక్రమము నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ డా.కె.మాధవీలత వారి ఆదేశాల మేరకు జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు జేసీ ఎన్.తేజ్ భరత్ తెలిపారు. ముఖ్య అతిథిగా తూర్పు గోదావరి జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, ఎల్ డి ఎం, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు, మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు, జిల్లాలోని రైతు భరోసా కేంద్రాలలో ఉన్న వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు, ప్రాథమిక గొర్రెలు మరియు మేకల పెంపకందారుల సహకార సంఘ అధ్యక్షులు, 400 మంది ఔత్సాహిక, అభ్యుదయ రైతులు, అందరూ భాగస్వాములవుతారని జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డా.ఎస్.టి.జి.సత్య గోవింద్ తెలిపారు.

చంద్రబాబు విడుదల కోరుతూ పాదయాత్ర

విశాలాంధ్ర - ఉండ్రాజవరం : టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు అక్రమ రిమాండ్ నుండి త్వరగా విడుదల కావాలని వేలివెన్ను తెలుగుదేశం పార్టీ ఎస్సి మాదిగ సామాజిక వర్గం పాదయాత్ర చేపట్టారు. నిడదవోలు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు నాయకత్వంలో ఆదివారం వేలివెన్ను నుండి గౌరీపట్నం వరకు పాదయాత్ర నిర్వహించారు. చంద్రబాబు తొందరగా విడుదల కావాలని నిర్మలగిరి మేరీమాతను వేడుకునేందుకు యాత్ర నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

ప్రమాదం అంచున నిత్యం రాకపోకలు

విశాలాంధ్ర - సీతానగరం : ప్రమాదం అంచున నిత్యం రాకపోకలు సాగిస్తున్నా వైనం. మండలంలో రెండు పంచాయితీలలో గల మూడు గ్రామాలు అయినా చీపురుపల్లి, నాగం పల్లి, అచ్చియ పాలెం గ్రామాలకు నిత్యం ఈ రహదారి నుండి రైతులు, విద్యార్థులు, ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అలాంటి ఈ రహదారి చినకొండేపూడి గ్రామం శివారులో రోడ్డుకు ఒక వైపు రైతులు వరద నీరు వెళ్ళకపోవడంతో తూరలను తొలగించి బోదు తీసి వదిలివేశారు. నాటి నుండి నేటి వరకూ తూరలు వేసి గొయ్య పుడ్చకపోవడంతో ఆ గొయ్య ప్రమాదకరంగా మారింది. ఈ రహదారి నిత్యం ప్రయివేటు బస్సులు, రైతులు, ఆటోలు నిత్యం ప్రమాద అంచున రాకపోకల చేస్తున్నామని ప్రజలు అవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులు, నాయకులు స్పందించి చర్యలు చేపట్టి తూరలు వేసి గోయ్యిని పుడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధి పదంలో కానూరు అగ్రహారం

విశాలాంధ్ర - పెరవలి : రాష్ట్ర అభివృద్దే ప్రభుత్వ ధ్యేయం అని యంయల్ఏ శ్రీనివాస్ నాయుడు అన్నారు. ఆదివారం పెరవలి మండలం కానూరు అగ్రహారం గ్రామంలో జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా 73 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించు ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయిర్ ట్యాంకు, పైపులైన్లు మరియు తాగునీటి కుళాయిలు యర్పాటుకొరకు ఆయన శంకుస్థాపన చేయడం జరిగింది. ఆయన మాట్లాడుతూ రాష్ట అభివృద్ధి కొరకు వైయస్ఆర్ ప్రభుత్వం అహర్నిశలు పాటుపడు తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఎంపిపి, జెడ్పీటీసీ, మండల అధ్యక్షులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, సచివాలయం కన్వీనర్లు మండల, గ్రామ వైఎస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల భారాలను వ్యతిరేకిస్తూ సంతకాల సేకరణ

విశాలాంధ్ర - కాకినాడ : రాష్ట్ర ప్రజలపై ప్రభుత్వం భారీగా వేస్తున్న విద్యుత్ చార్జీల భారాలకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం కాకినాడ మెయిన్ సండే మార్కెట్‌లో సంతకాలు సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు, నగర కమిటీ సభ్యులు కె సత్తిరాజు, దుంపల ప్రసాద్‌లు మాట్లాడుతూ ప్రతీ నెలా విద్యుత్ బిల్లులు భారీగా వస్తున్నాయన్నారు. సెప్టెంబర్ 27న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో జరుగబోయే ధర్నా జయప్రదం చేయాలని పిలుపు ఇచ్చారు. ప్రజలు పెద్ద సంఖ్యలో సంతకాలు చేస్తూ, సిపిఎం కృషి ని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మలక వెంకటరమణ, కె నాగజ్యోతిలతో పాటు సూరిబాబు, దుర్గా ప్రసాద్, జైరామ్, ఆదర్శ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

మందు గుండు తయారీ కేంద్రం సీజ్

విశాలాంధ్ర - కరప : కరప మండలం గొర్రిపూడి గ్రామంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా మందు గుండు తయారు చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాలతో డీఎస్పీ, సిఐల పర్యవేక్షణలో కరప ఎస్సై నౌడు రామకృష్ణ మందు గుండు తయారు చేస్తున్న రేకాటి అశోక్ కుమార్ సన్నాఫ్ వీర వెంకట సత్యనారాయణ అదుపులోకి తీసుకుని అతను వద్దనున్న మందు గుండు సామగ్రిని సీజ్ చేయడం జరిగిందని ఎస్సై రామకృష్ణ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

విశాలాంధ్ర - జగ్గంపేట : విద్యుత్ షాక్‌కు ముగ్గురు మృతి చెందిన ఘటన మరువక ముందే ఆదివారం జగ్గంపేటలో జరిగిన మరొక ఘటనలో విద్యుత్ షాక్‌కు యువకుడు బలయ్యాడు. వివరాల్లోకి వెళితే జగ్గంపేట మండలం రామవరం గ్రామానికి చెందిన కాకులపాటి నాగేంద్రప్రసాద్ (17) ఒక షాపులో పనిచేస్తున్నాడు. ఆ షాపు వద్ద ప్రమాదవశాత్తు 11 కెవి వైర్లు తగిలి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు అతన్ని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు జగ్గంపేట ఎస్ఐ నాగార్జున రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అవినీతికి వివక్షతకు తావు లేకుండా పాలన

విశాలాంధ్ర - అనపర్తి : అవినీతి, వివక్షతకు తావు లేకుండా పరిపాలన ప్రజలకు చేరువ కావాలనే ప్రధాన ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకురావడం జరిగిందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. ఆదివారం సుమారు రూ.97 లక్షల వ్యయంతో నిర్మించిన స్థానిక సచివాలయం-2, రైతు భరోసా కేంద్రం, వెల్నెస్ సెంటర్ భవనాలు,పాత ఊరిలో సచివాలయం-4 పరిధిలో నిర్మించిన వెల్నెస్ సెంటర్ ఎమ్మెల్యే సత్తి ప్రారంభించారు.

తరాలు మారాయి.. పాత తరం వాళ్ళకి కష్టమే

- సినీ నిర్మాత నరసింహారావు

విశాలాంధ్ర - భీమవరం టౌన్ : తరాలు మారాయి.. పాత తరం వాళ్ళకి ఇప్పుడు సినిమా చేయాలంటే కష్టమేనని, ఆనాటి నిర్మాతలకు ఈ తరంలో చేద్దామన్నా అవకాశాలు రావడం లేదని సినీ నిర్మాత, రాశీ మూవీస్ అధినేత మారెళ్ల నరసింహారావు అన్నారు. ఆదివారం భీమవరంలో మాట్లాడుతూ తన 20వ ఎటానే సినీ పరిశ్రమకు డబ్బింగ్ చిత్రం చేశానని, సుమారు 60 చిత్రాలు చేశానని, 40 డబ్బింగ్, 20 నిర్మాతగా చేశానని అన్నారు. కోదండ రామిరెడ్డి దర్శకత్వంలో శోభన్ బాబు హీరోగా బావ మరదళ్లు చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్నానన్నారు.అబ్బాయి గారు, మహారాజ, మంగళ గౌరీ, పెళ్ళైంది, భార్య భర్తలు ఇలా ఎన్నో సినిమా చేశానని, పెళ్ళైంది చిత్రం ఎంతో ఇష్టంతో చేశానని, కానీ ఆశించిన ఫలితం రాలేదన్నారు. శోభన్ బాబుతో 6 చిత్రాలు చేశానని, కృష్ణతో గుడచారి 117, విశ్వనాథ్, ఈవివిలతో చిత్రాలు చేశానని, రాఘవేంద్రరావుతో చేయాలని ఉండేదన్నారు. ప్రస్తుతం సినీ పరిశ్రమకు దూరంగా ఉన్నానని, ఇప్పటి ట్రేడ్స్ తగ్గట్టుగా కథలున్నా దానికి తగ్గ బడ్జెట్ కష్టమేనని అన్నారు. పాత తరం వాళ్లని తీసుకోవడానికి కొత్త తరం వాళ్ళు కొంత ఆలోచిస్తున్నారని అన్నారు.

వేడంగిలో వైభవంగా గణేష్ నిమజ్జనం

విశాలాంధ్ర - పోడూరు: మండలంలోని వేడంగిలో శివాలయం సెంటర్ వద్ద గణేష్ యూత్ వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి ఆదివారం వైభవంగా నిమజ్జనోత్సవం జరిపారు. తొలుత వినాయకునికి ప్రత్యేక పూజలు జరిపారు. స్వామి వారి ప్రసాదం లడ్డును పాట పెట్టిన అనంతరం అందంగా అలంకరించిన వాహనంపై గణేష్ ని విగ్రహాన్ని ఉంచి భజంత్రీలతో గ్రామం వీధులలో ఊరేగింపు జరిపారు. మహిళలు హారతులు ఇచ్చారు అనంతరం నరసాపురం నిడదవోలు కాలువలో వినాయకుని విగ్రహాన్ని నిమజ్జనోత్సవం చేశారు. ఈ సందర్భంగా అన్న సమారాదన జరిపారు. గణేష్ యూత్ కమిటీ సభ్యుల పర్యవేక్షణ లో ఎంతో భక్తి శ్రద్ధలతో స్వామివారి నిమజ్జోత్సవ కార్యక్రమాన్ని జరిపారు.

శ్రీనును పరామర్శించిన జనసేన ధర్మరాజు

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం మండలం అగ్రహార గోపవరం గ్రామానికి చెందిన పుచ్చకాయల శ్రీనుకి ఇటీవలే ప్రమాదవశాత్తు కాలు ఫ్యాక్చర్ అయినందున ఆదివారంశ్రీనుని పరామర్శించిన ఉంగుటూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్ చార్జ్ పత్సమట్ల ధర్మరాజు ఆయనతో పాటు జనసేన నాయకులు వంగ రఘు,తోట శ్రీను,తానేటి జోగేశ్వరావు,గ్రామ అధ్యక్షులు నాయుడు ప్రభాకర్, ఉపాధ్యక్షులు బోనాల నారాయణ, మీసాల బాబ్జీ, కొండవీటి వీరభద్రరావు, కోటి, చిన్నం ఆనంద్, గ్రామ జనసైనికులు,తదితరులు పాల్గొన్నారు.

మానవత ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు

విశాలాంధ్ర - ఉంగుటూరు : ఉంగుటూరు మానవతా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తామని మానవత రీజియన్ చైర్మన్ పుప్పాల గోపి అన్నారు. ఆదివారం ఉంగుటూరులో మంద జయలక్ష్మీ నివాసంలో మండల మానవతా సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షులు గంజి రవి కుమార్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో శీతాల సత్యనారాయణ బొమ్మిడి అప్పారావు, పిళ్ళా రామకృష్ణ, కొనే సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

విశాలాంధ్ర - కలిదిండి: గ్రామాలలో మౌలిక వసతులు కల్పించి గ్రామాలను అభివృద్ధి కి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే దూలం. నాగేశ్వరావు అన్నారు. ఆదివారం మండలంలోని పెద్దలంక గ్రామంలో రూ 20 లక్షల తో నిర్మించిన సీసీ రోడ్డు ను ప్రారంభించి శిలాఫలం ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఏదైతే మాట ఇచ్చామో ప్రతి పనిని ప్రతి మాటను నెరవేర్చామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చందన. ఉమామహేశ్వరరావు, ఏఎంసి చైర్మన్ ఐనాల. బ్రహ్మాజీ, ఏఎంసి ఉపాధ్యక్షులు పాము. రవికుమార్, మండల పార్టీ అధ్యక్షులు తిరుమాని. రమేష్ పాల్గొన్నారు.

జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర - తణుకు: జాతీయ సేవా పథకం ద్వారా నాయకత్వ లక్షణాలు ఏర్పడతాయని మహిళా కళాశాల ప్రిన్సిపాల్ కరటూరి రామకృష్ణ అన్నారు.స్థానిక ఎస్ కె ఎస్ డి (డిగ్రీ, పీజి) అటానమస్ మహిళా కళాశాలలో ఆదివారం జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ అధ్యక్షత వహించి మాట్లాడుతూ సామాజిక సేవ ఇతరులకు, నాకు కాదు అనే సిద్ధాంత ప్రచారంతో దేశమంతా అత్యధిక సభ్యులతో కూడి సంఘ, రాష్ట్ర దేశమునకు సంబంధించి గ్రామీణ ప్రాంత ప్రజలకు అనేక విషయముల పట్ల అవగాహన కల్పించడంలో ఎన్ఎస్ఎస్ ముఖ్యపాత్ర వహిస్తుందన్నారు. సామాజిక సేవ అనేది ప్రజా చైతన్యాన్ని, బాధ్యతల్ని కలుగజేస్తుందని తెలిపారు. విద్య వైద్య ప్రకృతి పరిరక్షణ మొదల విషయాలలో జాతీయ సేవా పథకం ద్వారా విద్యార్థిని విద్యార్థులు చేసే సేవలు అద్భుత మైనవన్నారు. సమాజానికి ఉపయోగపడే చైతన్యాన్ని కలిగించే కార్యక్రమాలు చేయడానికి జాతీయ సేవా పథకం ఎంతో ఉపయోగపడుతుందని, సేవ ద్వారా ఆత్మ సంతృప్తి పొందుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జి. రమ్య, పిల్లాడు సిహెచ్ రమేష్ బాబు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థినులు, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలి

విశాలాంధ్ర - పెదవేగి: మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయడంతో పాటు వారి ఆశయ సాధన కోసం ప్రతి వ్యక్తి కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు మాదిగ, దెందులూరు నియోజకవర్గం శాసనసభ్యులు కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. ఆదివారం రామసింగవరం గ్రామంలో ఏర్పాటు చేసిన బాబు జగజీవన్ రామ్ విగ్రహాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ బాబు జగజ్జీవన్ రామ్ అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేశారన్నారు. భారత పార్లమెంటులో ఎక్కువ కాలం మంత్రిగా పనిచేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. రైల్వే శాఖ మంత్రిగా పనిచేసిన సమయంలో అనేక సంస్కరణలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మెట్లపల్లి సూరిబాబు, వెన్నవల్లి రవి, మహేంద్ర దళిత నాయకులు పెరికే వరప్రసాద్, పొలిమేర హరికృష్ణ, ఎర్ర నాగమల్లేశ్వరరావు, కూచింపూడి ఎంపీటీసీ కాలి చిన్న బుజ్జి, బాబు జగజీవన్ రామ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి పటిష్ట చర్యలు

- ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

విశాలాంధ్ర - భీమవరం టౌన్: భీమవరం నియోజవర్గంలోని ఆలయాల అభివృద్ధికి పటి ష్ట చర్యలు తీసుకోవడం జరిగిందని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పంచారామ క్షేత్రాల్లో ఒకటైన గునుపూడి శ్రీఉమా సోమేశ్వర జనార్ధన స్వామి వారి దేవస్థానం ఇంచార్జ్ ఈవోగా నియమితులైన డి.రామ కృష్ణంరాజు ఆదివారం సాయంత్రం స్థానిక క్యాంపు కార్యా లయంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ భక్తులకు ఆలయంలో ఆధ్యాత్మికతను కల్పించడంతోపాటు స్వామి వారి, అమ్మవారి దర్శనం ప్రశాంత వాతావరణంలో కల్పించాలని ఆదేశించారు. ఇప్పటివరకు ఈ ఆలయంలో ఈవోగా పనిచేసిన చాగంటి సురేష్ నాయుడు నరసాపురం గ్రూపు దేవస్థానాలకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మొగల్తూరు మండలం ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ అమ్మవారి దేవస్థానం ఇవోగా పనిచేస్తున్న డి.రామకృష్ణం రాజును పంచారామ క్షేత్రం ఇన్చార్జ్ ఈవోగా నియమించడం జరిగింది.

26న పిల్లలకు ఉచిత గుండె వైద్య శిబిరం

విశాలాంధ్ర -భీమవరం: పిల్లల గుండె సంబంధిత వ్యాధులకు ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం ఉదయం మేంటేవారి తోటలోని అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ వైద్య సహాయ కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. ఆదివారం ఆయన భీమవరంలో ఒక ప్రకటన విడుదల చేసి మాట్లాడుతూ విజయవాడకు చెందిన పిల్లల గుండె వైద్య నిపుణులు డాక్టర్ కె.విక్రమ్ పిల్లలను పరీశీలించి చేసి అవసరమైన వారికి పరీక్షలు నిర్వహిస్తారన్నారు.

నూతన కమిటీ రైతుల అభ్యున్నతికి కృషి చేయాలి

పౌరసరఫరాల శాఖా మంత్రి కారుమూరి

విశాలాంధ్ర - ఉండి: రైతుల అభ్యున్నతికి నూతన కమిటీ కృషి చేయాలని పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సూచించారు. ఆదివారం డిసిసిబి చైర్మన్ పివిఎల్ నరసింహారాజు అధ్యక్షతన నిర్వహించిన ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ముదునూరి ప్రసాదరాజు, పిల్లి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. నూతనంగా ప్రమాణస్వీకారం చేసిన కమిటీ రైతులకు అందుబాటులో ఉంటూ వారి అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు. ఉండి మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రంలోని శాస్త్రవేత్తలతో అనుసంధానమై వారి సలహాలు సూచనలు తీసుకుని రైతులకు తోడ్పాటు అందించాలన్నారు. ఏ కాలంలో ఏఏ పంటలు పండించాలి అనే విషయంపై శాస్త్రవేత్తలతో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. పుంత రహదారులను అభివృద్ధి పరిచి రైతులు పంటను మిల్లర్లకు అందించేందుకు ఎటువంటి ఇబ్బందులు జరగకుండా చూడాలన్నారు. అనంతరం నూతన కమిటీ చైర్మన్ బొక్కా వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ చేకూరి రాజా నరేంద్ర కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమ మీద నమ్మకం ఉంచి తమకు అవకాశం కల్పించిన డిసిసిబి చైర్మన్ పివిఎల్ నరసింహరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి అభ్యున్నతికి కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, గుడాల శ్రీహరి గోపాలరావు, ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్, డీసీఎంఎస్ చైర్మన్ వేంద్ర వెంకటస్వామి, మేడిది జాన్సన్, చిన్నమిల్లి రాయుడు, ఉండి గ్రామ సర్పంచ్ కమతం సౌజన్య బెనర్జీ, వివిధ గ్రామాల సర్పంచులు, మండల జిల్లా స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్మీ గణపతిని దర్శించుకున్న ధర్మరాజు

విశాలాంధ్ర- ఉంగుటూరు : ఉంగుటూరు మండలం రావులపర్రు గ్రామం లో శ్రీ లక్ష్మి గణపతి ఆలయం లో స్వామి వారిని ఆదివారం ఉంగుటూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జీ పత్సమట్ల ధర్మరాజు దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు.వారితో పాటు పొత్తూరి కృష్ణం రాజు, వంగ రఘు, తాడిశెట్టి ఎంబి. స్వామి, శివ కుమార్, ప్రసాద్, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర - ఏలూరు క్రైమ్: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రెండవ పట్టణ ఎస్ ఐ శేఖర్ హెచ్చరించారు. ఆదివారం రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ లో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రౌడీ షీటర్లతో ఎస్ఐ శేఖర్ మాట్లాడుతూ ప్రజాశాంతికి భంగం కలిగించే లాగా ఎవరైనా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సత్ ప్రవర్తన కలిగి అంటే రౌడీ షీట్లు తొలగించేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామన్నారు.రౌడీ షీట్లు కలిగి ఉండి ప్రజాశాంతికి లేదా ప్రైవేట్ సెటిల్మెంట్ లకు ప్రయత్నం చేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

దేవస్థానం అభివృద్ధికి కృషి చేయాలి

విశాలాంధ్ర - కలిదిండి: కలిదిండి శివారు భోగేశ్వర లంకలో కొలువై ఉన్న శ్రీ పార్వతీ సమేత పాతాళ భోగేశ్వర దేవస్థానం ఆలయ పునః నిర్మాణం కొరకు కృషి చేయాలని ఎమ్మెల్యే దూలం. నాగేశ్వరరావు సూచించారు. ఆదివారం భోగేశ్వర స్వామి వారి ఆలయం వద్ద ఆలయ పాలక మండలి, మండల ముఖ్య నాయకులు మరియు ఈఓ లతో జరిగిన అభివృద్ధి సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవస్థానం యొక్క అభివృద్ధి పనుల గురించి చర్చించారు. అనంతరం నిర్వహణ కమిటీలను, ఆర్థిక సహాయక కమిటీలను నియామకం చేశారు. తొలుత శ్రీ స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజ కార్యక్రమములో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చందన. ఉమామహేశ్వరరావు, ఏఎంసి చైర్మన్ ఐనాల. బ్రహ్మాజీ, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి. శ్రీదేవి, వైస్ ఎంపీపీ కూసంపూడి. కనక దుర్గారాణి, ఏఎంసి ఉపాధ్యక్షులు పాము. రవి కుమార్, మండల పార్టీ అధ్యక్షులు తిరుమాని. రమేష్, చెరుకువాడ. బలరామరాజు, మాజీ ఏఎంసి అధ్యక్షులు నీలపాల. వెంకటేశ్వరరావు, సర్పంచ్లు మసీముక్కుల. మారుతి ప్రసన్న, సాన. మీనా సరస్వతి, ద్రోణాద్రి. నాగలక్ష్మి, అనపర్తి. వడ్డీ కాసులు, మహాదేవ. విజయబాబు, గండికోట. ఏసుబాబు, ఎంపీటీసీ గోదావరి. సత్యనారాయణ, ఇమ్మానేని. లక్ష్మణరావు, పిఏసియస్ అధ్యక్షులు వడుపు. రామారావు, సాగి. చిన్నబ్బాయి రాజు, అంకెం. నరసయ్య, వడ్లాని. పార్థసారధి, తోకల. జగన్మోహన్, మాజీ జడ్పీటీసీ చన్నంశెట్టి. కోదండ రామయ్య, మోకా. రామకృష్ణ, తిరుమలశెట్టి. సుబ్రహ్మణ్యం, చన్నంశెట్టి నాగరాజు, నంబూరి బాబిరాజు, చిట్టూరి. బుజ్జి, బాలకృష్ణ, నాగముని, గొర్ల వెంకటేశ్వరరావు, కొల్లాటి. సత్యనారాయణ, చన్నంశెట్టి. సోమేశ్వరరావు, గండికోట వెంకటేశ్వరరావు, ఎం. వెంకటేశ్వరరావు, చాన్ బాషా, ఫణికుమార్, విష్ణు, పోసిన కొండ, నున్న భగవాన్, తదితరులు పాల్గొన్నారు.

బధిరుల, సంజ్ఞా భాషా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - ఏలూరు: ప్రపంచ బధిరుల దినోత్సవం సంజ్ఞా భాషల అంతర్జాతీయ దినోత్సవజిల్లా స్థాయి వేడుకలు ఏలూరు కలక్టరేట్ వద్ద గిరిజన భవనంలో నిర్వహించారు. వేడుకలకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన 150మంది బధిర దివ్యాంగులు హాజరయ్యారు. దివ్యాంగులలో అర్హత కలిగిన ముగ్గురు బధిర దివ్యాంగులు టచ్ ఫోనులు ఉచితముగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాలల పర్యవేక్షణ అధికారిని సూర్య చక్రవేణి, తహసీల్దార్, సి. హెచ్. తాతారావు, స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆంధ్ర ప్రదేశ్ ఉద్యోగుల విభాగము అధ్యక్షురాలు లావణ్య, పశ్చిమ గోదావరి జిల్లా బధిరుల సంఘం అధ్యక్షులు టి.రాము, ప్రధాన కార్యదర్శి, జి.ప్రవీణ్ వర్మ పాల్గొన్నారు.

నడకతో మానసిక రుగ్మతలు దూరం

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం : ప్రతీ రోజు ఉదయం ప్రకృతిలో శారీరక వ్యాయమం చేయడం వల్ల శరీరం,మనసు ఎంతో ఉల్లాసంగా ఉంటాయని,దీంతో మానసిక రుగ్మతల నుండి శారీరక వ్యాధులను బయట పడవచ్చని రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయులు నరసింహరాజు అన్నారు.స్థానిక శేషాద్రినగర్ లో క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించ బడుతున్న మున్సిపల్ పార్క్ వద్ద ఆదివారం ఉదయం వాకర్స్ అసోసియేషన్ , యోగా అసోసియేషన్, ఆరోగ్యాభిలాషులు కలిసి పార్కు అభివృద్ధికి సహకరించిన నడింపల్లి సత్యనారాయణ రాజు (తెలుగు దేశం రాజు)ను ఘనంగా సత్కరించారు.నడింపల్లి సత్యనారాయణ రాజు, స్థానిక క్షత్రియ సేవా సమితి సహకారంతోను, వ్యాయామ ఉపాధ్యాయులు నరసింహ రాజు కృషితో మున్సిపల్ పార్క్ ని అభివృద్ధి చేయడంతో ఈ రోజు ఎంతో మంది ఆరోగ్యాన్ని పొందే విధంగా ఆహ్లాదంగా తయారు చేయడం పట్ల ఆరోగ్యాభిలాషులు హర్షం వ్యక్తం చేశారు. యోగా గురువు తాండ్ర దిలీప్, అట్లూరి రామరాజు, బోడా సత్యన్నారాయణ, సీనియర్ జర్నలిస్ట్ వాసా సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

విశాలాంధ్ర - రాజోలు : ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరం చుకుని ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన రాజోలు, మామిడికుదురు మండలాలకు చెందిన ఉపాధ్యాయులను రాజోలు రోటరీ క్లబ్ భవనంలో రోటరీ సభ్యులు ఆదివారం ఘనంగా సత్కరించారు. రోటరీ అధ్యక్ష,కార్యదర్శులు వై కవీంద్ర, సిహెచ్ లక్ష్మణ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాజోలు మండల విద్యాశాఖ అధికారి నల్లి మనోహరం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్న రాజోలు మండలానికి చెందిన ఎఎస్అర్ కె.రాజు, మామిడికుదురు మండలానికి చెందిన కెవి రాఘవ రావు, అర్ చెల్లాయమ్మ, అలాగే రాజోలు మండలం నుండి ఉత్తమ ప్రతిభా అవార్డు పొందిన వ్యాయామ ఉపాధ్యాయులు చొప్పల చంద్ర శేఖర్, పెచ్చెట్టి రామకృష్ణలను రోటరీ సభ్యులు శాలువాలు మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ డిస్టిక్ గవర్నర్ నల్లి శివ శంకర్, సభ్యులు డాక్టర్ బసవ వరహాలు, దార్ల పెదబాబు, మహ్మద్ కిస్వర్, నామన షణ్ముఖ, ఐ సూర్యనారాయణమూర్తి, సోమ రాజు, బోళ్ళ శ్రీనివాస్, ఎస్టియూ అధ్యక్షుడు రాపాక ప్రసాద్, కార్యదర్శి పివివి సత్యనారాయణ, ఉపాధ్యాయులు కె అంజన్ బాబా, వై రాంబాబు, జి విశ్వనాథ గుప్తా, గటిగంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాబుతో నేను అనే నినాదంతో ప్ల కార్డులు ప్రదర్శన

విశాలాంధ్ర - కాకినాడ సిటీ : తెలుగు దేశం పార్టీ జాతీయ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఎక్స్ మేయర్ & కాకినాడ జిల్ల తెలుగు మహిళా అధ్యక్షురాలు సుంకర పావని తిరుమల కుమార్ ఆధ్వర్యంలో నల్ల జెండాలు, బాబుతో నేను అనే నినాదంతో ప్లే కార్డ్స్ ప్రదర్శిస్తు, కాకినాడ నేలప్పన్ సెంటర్, సుర్యనారాయణ పురం నందు ప్రజలకు చంద్ర బాబుకు జరిగిన అన్యాయాని ప్రతి ఇంటికి కరపత్రాలు రూపంలో పంపిణీ చేస్తు ప్రజలకు వివరించటమైనది. జగన్ రెడ్డి 16 నెలలు జైలులో ఉంటే జగన్ రెడ్డి చేసిన అవినీతి గురించి చేప్పుకున్నారని, చంద్రబాబుని అక్రమ అరెస్టు చైస్తే చంద్రబాబు చేసిన అభివృధిని ప్రజల చైపుకుంటున్నారని, ఎన్ని అక్రమ కేసులు పెట్టిన కడిగిన ముత్యంలా బాబు బయటకు వస్తారని పావని అన్నారు. కార్యక్రమంలో సుంకర పావని వెంట తెలుగుదేశం పార్టీ నాయకులు తోట సతీష్, నామ రాజకుమార్, చల్ల పార్వతీ, సత్య, నక్క జ్యోతి, రేలంగి లక్ష్మి, కనకం, దుర్గ, సత్యవతి, నిర్మల, రమణ పాల్గొన్నారు.

విడుదల చేసేంతవరకు పోరాటం ఆగదు

బూరుగుపల్లి శేషారావు

విశాలాంధ్ర - నిడదవోలు : తప్పుడు కేసులతో అక్రమంగా అరెస్ట్ చేసిన చంద్రబాబును విడుదల చేసేంతవరకు మా పోరాటం ఆగదని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ బూరుగుపల్లి శేషారావు అన్నారు. చంద్రబాబు నాయుడుకు తోడుగా, చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టకు నిరశనగా నిడదవోలు మండలం కోరుమామిడిలో నిడదవోలు నియోజకవర్గ తెలుగుదేశం,జనసేన పార్టీల ఆధ్వర్యంలో 13 వ రోజు సామూహిక నిరాహార దీక్ష శిబిరం నిర్వహించారు. అనంతరం నిరహార దీక్షలో పాల్గొన్నారు. దీక్ష లో మండల పార్టీ అధ్యక్షులు వెలగన సూర్యారావు,గ్రామ పార్టీ అధ్యక్షులు మటపర్తి చంద్రరావు,టీడీపి, నాయకులు, కార్యకర్తలుపెద్దఎత్తున పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జన బందోబస్తు పరిశీలించిన ఎస్పీ

విశాలాంధ్ర - యు.కొత్తపల్లి : ఉప్పాడ సముద్ర తీరంలో గణేష్ నిమజ్జనం కార్యక్రమంలో భాగంగా పోలీస్ బందోబస్తును కాకినాడ జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదివారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కాకినాడ, పెద్దాపురం పోలీస్ డివిజన్లో ఈనెల 18వ తేదీ నుండి ప్రారంభమైన వినాయక చవితి వేడుకలు, ఏడవ రోజు జరుగుతున్న శోభ యాత్రలు వినాయక విగ్రహాల నిమజ్జనం జరిగే తీరును స్థానిక పోలీస్ అధికారులతో పర్యటిస్తున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఉప్పాడ సముద్ర తీరంలో ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జనం ప్రదేశాలను పరిశీలించడం జరిగిందని, నిమజ్జనం కార్యక్రమంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈయన వెంట కాకినాడ రూరల్ సర్కిల్, పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

27 నుంచి అక్టోబర్ 26 వరకు రోడ్డు, రైల్వే బ్రిడ్జి మూసివేత

రెండు కోట్లతో మరమ్మతు పనులు

విశాలాంధ్ర - కొవ్వూరు : ఈనెల 27 నుంచి రాజమండ్రి కొవ్వూరు మధ్య ఉన్న రైల్వే బ్రిడ్జిని వచ్చేనెల 26 వరకు మరమ్మతుల నిమిత్తం మూసివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ మాధవి లత ఉత్తర్వులు జారీ చేసినట్లు వారు పేర్కొన్నారు. బ్రిడ్జికి దాదాపు రెండు కోట్లతో మరమ్మత్తులు చేపడుతున్నట్లు అందువల్ల బ్రిడ్జి మూసివేత అనివార్యమైందని అధికారులు తెలిపారు. ఈ నేపద్యంలో ఈ వంతెన మీద మీదుగా రాకపోకలు సాగించే వాహనాలను గ్రామన్ ఇండియా బ్రిడ్జి మీదుగా తరలిస్తామన్నారు. అధికారుల అవగాహన లోపం.. ప్రయాణికుల పాలిట శాపం రోడ్ కం రైల్వే బ్రిడ్జిని ఇటీవల కాలంలో తరచూ మూసివేసి మరమ్మతులు సాగించడం పరిపాటయింది. దీంతో ఈ వంతెన మీదుగా రాకపోకలు సాగించే ప్రయాణికులు పలు అవస్థలు పడుతున్నారు. ఎందుకంటే రాజమండ్రిలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఉండటం మరోవైపు పెద్ద పెద్ద విద్యాసంస్థలు అక్కడ ఉండడంతో రోగులు, విద్యార్థులు ఈ వంతెన మీదట ప్రయాణాలు సాగిస్తుంటారు. గ్రామ్ ఇండియా బ్రిడ్జి ద్వారా రాజమండ్రి వెళ్ళాలంటే దాదాపు 20 కిలోమీటర్ల పైనే ఉంది. అదే రోడ్డుకం రైల్ బ్రిడ్జి మీదుగా అయితే కేవలం కొవ్వూరు నుంచి రాజమండ్రి ఐదు కిలోమీటర్ల మాత్రమే దూరం ఉంది దీంతో గ్రామన్ ఇండియా వంతెనమీదుగా ప్రయాణించాలంటే దూర భారంతో పాటు ప్రయాణికుల జేబులకు చిల్లులుపడుతున్నాయి. అంతే కాకుండా ప్రమాదకర పరిస్తితిలో ఉన్న రోగులకు మరింత ఇబ్బందిగా మారి ప్రాణాల మీదకి వచ్చే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్న సందర్భాలు ఉన్నాయి అదే విధంగా పాఠశాల విద్యార్థులు సమయానికి విద్యాసంస్థలకు చేరడానికి కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి ఇటువంటి పరిస్థితుల్లో అధికారులు తరచూ మరమత్తుల పేరుతో మూసివేయడానికి బదులు శాశ్వత పద్ధతిన మరమ్మతులు నిర్వహిస్తే తమకి బాధలు ఉండవని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం అత్యవసర వైద్య సేవల నిమిత్తం అంబులెన్సులైనా అనుమతించాలని పలువురుకోరుతున్నారు.

అన్న సమారాధనల నిర్వహణ

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని, వేడుకలు ముగింపు సందర్భంగా మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం అన్న సమారాధనలు నిర్వహించారు. సూర్యారావు పాలెం కమ్మ యువజన సంఘం ఆధ్వర్యంలో మూడు వేల మందికి, చివటం గౌడ సేవా సమితి ఆధ్వర్యంలో 2000 మందికి, కె సావరం లలితా నగర్ గణేష్ ఉత్సవ కమిటీ, పరిసర గ్రామ ప్రజలకు 3000 మందికి, ఉండ్రాజవరం వరసిద్ది వినాయక ఆలయం వద్ద సుమారు 4000 మందికి వివిధ రకాల భోజన పదార్థాలతో అన్న సమారాధనలు నిర్వహించారు.

భారీగా పోలీసుల మోహరింపు

విశాలాంధ్ర - అనపర్తి : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టు నిరసిస్తూ రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బైక్ ర్యాలీకి పిలుపునివ్వడంతో ఆదివారం రామవరంలో ఉద్రిక్తత చోటు చేసుకోవడం జరిగింది.దీంతో రామవరంలో పోలీసులు భారీగా మోహరించారు. రామ కృష్ణారెడ్డి ఇంటి వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పెద్ద ఎత్తున పోలీసులు చేరుకుని బందోబస్తు నిర్వహించారు. టిడిపి శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించకుండా పోలీసులు నిలిపివేశారు. సిఐ విప్పర్ల శ్రీనివాస్, ఎస్ ఐ అప్పారావు ఎటువంటి వివాదాలకు తావు లేకుండా దగ్గరుండి పర్యవేక్షించారు.

న్యాయానికి, ధర్మానికి సంకెళ్లు : కుందుల

విశాలాంధ్ర - నిడదవోలు : రాష్ట్రాన్నీ అభివృద్ధి పథంలో నడిపి 14 సంవత్సరాలు ముఖ్యమంత్రి గా సేవలందించిన చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేయడమంటే న్యాయానికి సంకెళ్ళు, ధర్మానికి సంకెళ్లు వేసినట్లేనని టీడీపీ సీనియర్ నాయకులు కుందుల సత్యనారాయణ అన్నారు. నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును వ్యతిరేకిస్తూ 12వ రోజులుగా నిర్వహిస్తున్న సామూహిక నిరాహార దీక్ష నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో ఆదివారం వినూత్న శైలిలో చేతులకు సంకెళ్లు వేసుకుని దీక్ష నిర్వహించారు.

ఎమ్మెల్యే తలారి వెంకట్రావు జన్మదినం

విశాలాంధ్ర - దేవరపల్లి : గోపాలపురం శాసనసభ్యుడు తలారి వెంకట్రావు జన్మదిన వేడుకలు దేవరపల్లిలో ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదివార ఘనంగా జరిగాయి గోపాలపురం నియోజకవర్గంలో నాలుగు మండలాలకు చెందిన మండల వైసీపీ అధ్యక్షులు ఎంపీపీలు జడ్పిటిసిలు అధికారులు తదితరులు జన్మదిన వేడుకలు పాల్గొన్నారు. 180 కిలోల కేకును కట్ చేశారు ద్వారకాతిరుమల దేవస్థానం చెందిన వేదపండితులు తలారి వెంకట్రావును వేదమంత్రోచ్చారణతో ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం ఏఎంసిచైర్మన్ జి జనార్ధన రావు దేవరపల్లి ఎంపీపీ కేవీకే దుర్గారావు మండల పార్టీ అధ్యక్షుడు కూచిపూడిళ సతీష్స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు అంతకుముందు ఎమ్మెల్యే తల్లిదండ్రులు తలారి ఏసుదాసు విజయలక్ష్మి దంపతులు ఎమ్మెల్యే వెంకట్రావును ఆశీర్వదించారు.

దుర్గారావు మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

విశాలాంధ్ర - అయినవిల్లి : బదుగు దుర్గారావు మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని పలువురు నివాళులర్పించారు. ఇటీవల మరణించిన అయినవిల్లి పెద్ద పేటకు చెందిన కార్మిక, దళిత సంఘాల నాయకుడు బదుగు దుర్గారావు కుటుంబాన్ని జిఎంసి బాలయోగి చారిటబుల్ సొసైటీ వ్యవస్థాపకులు గంగుమళ్ళ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ బయ్యా చినబాబు, వైయస్ఆర్ సీపీ నాయకులు ఆదివారం పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలియజేశారు. అలాగే దుర్గారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వైఎస్ఆర్‌సీపీ నాయకులు బొంతు రాజేంద్రప్రసాద్, మాజీ సైనికులు వడ్డి శ్రీనివాసరావు, నామాడి ఏడుకొండలు, కోరపు శ్రీనివాసరావు, బుడితి శ్రీనివాసు పాల్గొన్నారు.

ఆలయాల్లో మానసిక ప్రశాంతత

విశాలాంధ్ర - కాజులూరు : ఆలయాల ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖామంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. ఆదివారం తనుమళ్ల గ్రామంలో నూతనంగా నిర్మించనున్న రామాలయానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న ఆలయాల ద్వారా వచ్చే తరంగాలతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఆలయాల వద్ద జరుగుతున్న కార్యక్రమాలకు ప్రజలందరూ కలిసికట్టుగా పనిచేసి ఐఖ్యంగా ఉండాలని సూచించారు. అయన నిర్మాణానికి పది లక్షల రూపాయిలు నిధులు మంజూరుకు కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా మండల పార్టీ అధ్యక్షుడు గుబ్బల ఏసురాజు, సలాది రమణ, పిల్లి శ్రీను, దుబాయి శ్రీను, గ్రామస్థులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ రిలే నిరాహార దీక్ష

విశాలాంధ్ర - పి గన్నవరం : పి గన్నవరంలో టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ టిడిపి నాయకులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ మేరకు మామిడికుదురు, పి గన్నవరం మండలాల టిడిపి గ్రామ శాఖ అధ్యక్ష కార్యదర్శులు ఆదివారం రిలే నిరాహార దీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకుల రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని పి గన్నవరం నియోజకవర్గ టిడిపి సహా సమన్వయకర్త నామన రాంబాబు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్ బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పి గన్నవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ముఖ్య నేతలు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.